పేదలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో కలిసి పర్యటించి, వారికి అందుతున్న పథకాల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారునూ కలిసి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, పథకాల అమలులో ఇబ్బందులుంటే పరిష్కరించడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రతిఒక్కరూ అండగా నిలిచే విధంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు నిర్మల, సత్యనారాయణ, వెంకటరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసరావు, రమాదేవి, ప్రసాద్, దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, అజీజ్, వేణుబాబు, చెన్నారావు, గోపాలరావు, శోభనాద్రి, శ్రీనాధ్, నెహ్రూ, జాకీర్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ

విస్సన్నపేట: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి సంబంధించి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజామద్దతు పుస్తకంలో ప్రశ్నలను అడిగి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం విస్సన్నపేటలో శనివారం నిర్వహించారు. స్థానిక రాజీవ్‌కాలనీ, నందేటివారి వీధిలో సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి యజమాని అనుమతులతో స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జి.మల్లయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్నే మా భవిష్యత్తు

ఇబ్రహీంపట్నం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మండలంలో గ్రామాలు, కొండపల్లి మున్సిపాలిటీలో రెండో రోజు శనివారం విజయవంతంగా సాగింది. కిలేశపురంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న పాల్గొన్నారు. మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. సర్పంచ్ కాకి దేవమాత, మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, గృహ సారథులు, కన్వీనర్లు, పాల్గొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు భూక్యగనియా, సర్పంచ్ మోర్ల లక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ నాగకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ గుర్రాల వెంకట్రావు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాలనతోనే సంక్షేమ రాజ్యం

నూజివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు ఎంతో మంచి జరిగిందని, ప్రతి కుటుంబానికి అనేక సంక్షేమ పథకాలు అందాయని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీ దుర్గ అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో శనివారం జగన న్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి వార్డులో ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను రద్దు చేయకుండా అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్ర మే పేదల పక్షాన నిలబడి పాలన చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలపరిచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు.

పేదల ఇంటి ముంగిటకే ప్రభుత్వం

మొర్సుమల్లి(మైలవరం): పేదల ఇంటి ముంగిటకే ప్రభుత్వం అని, అసలైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేయడానికే వైఎస్సార్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు జగనన్న మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం మండలంలోని మొర్సుమల్లి, పుల్లూరు గ్రామాల్లో రెండో రోజు శనివారం కొనసాగింది. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని గురించి వివరిస్తూ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేసిన అభివృద్ధిని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మాడపాటి శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్ చామల సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

ఆగిరిపల్లి: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. మండల పరిధిలోని కలటూరులో సర్పంచి రాఘవరపు సురేష్‌కుమార్, వైస్ ఎంపీపీ గద్దం సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులతో శనివారం మాట్లాడారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇళ్లకు అతికించారు.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ముమ్మరంగా నిర్వహించారు. నరశింహారావుపాలెంలో మండల సచివాయాల కన్వీనర్ పుచ్చకాయల సుబ్బారెడ్డి, సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి పాల్గొన్నారు.



తిరువూరులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి



విస్సన్నపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం



కిలేశపురంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎంపీపీ జోత్స్న



నూజివీడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో స్టిక్కర్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



కలటూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



నరసింహారావుపాలెంలో స్టిక్కర్‌ను ఓ ఇంటి తలుపునకు అంటిస్తున్న సుబ్బారెడ్డి

రేపటి నుంచి బాబా విగ్రహ ప్రతిష్ట వారోత్సవాలు

మైలవరం: గ్రామంలో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా మందిరములో ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 29వ శ్రీసాయిబాబా విగ్రహ ప్రతిష్ట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సాయి భక్త సమాజం కన్వీనర్ జీ మోహనరావు శనివారం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,500 చెల్లించాలి

మైలవరం: మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2500 కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య డిమాండ్ చేశారు. మైలవరం మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్నను ఏపీ కౌలు రైతుల సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు రంగంలోకి దిగి మొక్కజొన్న పంటను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. దళారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర రాకుండా తగ్గించి మొక్కజొన్న రైతుల కష్టాన్ని దోచుకు తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం మొక్కజొన్న క్వింటా రూ.2,400 కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.1,900కు కూడా కొనకుండా రైతులను మోసం చేస్తున్నారన్నారు. మైలవరం, పుల్లూరు, బొర్రగూడెం తదితర గ్రామాలలో బృందం సభ్యులు పర్యటించారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. బృందంలో బుద్ధవరపు వెంకట్రావు, కాళింగి కొండలు, వంశీకృష్ణ, కే సత్యనారాయణ ఉన్నారు.

క్లుప్తంగా

75 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం వృద్ధులకు ఆలంబనగా నిలుస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు సబ్ సెంటరులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. 60 ఏళ్ల నిండిన 75 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, మందులు అందించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది వై.ఝాన్సీకుమారి, జి.అనిత, ఐఎస్ బిఎస్ కుమారి, కె.స్వరూప పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



కంకిపాడు: పేదలను ఆదుకోవటం సామాజిక బాధ్యత అని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో కంకిపాడు, ఈడుపుగల్లు గ్రామాలకు చెందిన పేదలకు ఈస్టర్ పండుగ పురస్కరించుకుని నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు, రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం శనివారం అందించారు. ధనేకుల ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రావి రాజేష్, షేక్ షకార్, పర్వతనేని రవి, పి.రామకృష్ణ, బుజ్జి, కాకుళ్ల సుధాకర్, విజయవాడ రూరల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాస్తి శ్రీనివాసరావు, కార్యదర్శి కోమటి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కంకిపాడు: పట్టణంలోని ప్రధాన సెంటరులో చెన్నకేశవస్వామి దేవస్థానం భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఆలయ ఆచార్యులు హరిబాబు, స్థానిక ప్రతినిధులు శేగు నరసింహారావు, మారం వెంకట అయోధ్యరామారావు, గ్రంధి సత్యనారాయణ, గ్రంధి రామకృష్ణ, చెక్కా ఆనంద్, నంది కేశవరావు, విస్సంశెట్టి మురళీకృష్ణ, మానేపల్లి సాయి పాల్గొన్నారు.

236 మంది విద్యార్థులు గైర్హాజరు

కంకిపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పబ్లిక్ పరీక్షల్లో శనివారం విద్యార్థులు ఇంగ్లీషు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 143 పరీక్షా కేంద్రాలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ విద్యాశాఖ ఏర్పాటుచేసింది. ఈ కేంద్రాల్లో 20039 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 19803 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 236 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఉన్న ఏడు పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 34 పరీక్షా కేంద్రాలను సందర్శించాయి. పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతున్నాయని డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు.

పోరంకిలో మహిళపై దాడి

పెనమలూరు: పోరంకిలో మహిళపై ఆమెతో కలిసి ఉండే వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బీజేఆర్‌నగర్‌లో బి.సౌజన్య తల్లితండ్రులతో కలిసి ఉంటుంది. ఆమె గత 15 సంవత్సరాలుగా ఫణికుమార్ అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉంది. వీరికి బాబు ఉన్నాడు. అయితే ఫణికుమార్ మరో వివాహం చేసుకుని సౌజన్యకు దూరంగా తాడిగడపలో ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీన సౌజన్య తాడిగడపలో ఉన్న ఫణికుమార్ వద్దకు వెళ్లగా గొడవ జరిగింది. కాగా శుక్రవారం చర్చికి వెళ్లి ఇంటికి వచ్చి పడుకున్న సమయంలో సౌజన్య పై ఫణికుమార్ బీరు సీసాతో దాడి చేశాడు. ఈ ఘటనలో సౌజన్యకు గాయాలు అవ్వటంతో ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు.

చదరంగంలో గుర్తింపు తేవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చదరంగం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు. ఈనెల 20 నుంచి 23వరకు పోరంకి గ్రీన్ స్కూల్‌లో నిర్వహించనున్న వీరమాచనేని విజయలక్ష్మి మెమోరియల్ అండర్ 17 బాలికల ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను ఢిల్లీరావు ఆవిష్కరించారు. శనివారం చెస్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావును కలిసి టోర్నమెంట్ వివరాలు తెలియజేశారు. పోస్టర్ ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాలికల రేటింగ్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలికల రేటింగ్ టోర్నమెంట్ మొట్టమొదటి సారిగా నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎం. ఫణికుమార్, ట్రెజరర్ ఎస్‌ఏ గఫూర్, పీఆర్వో రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాలు ఆనందమయం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: సంక్షేమ పథకాలతో పేదల జీవితాలను ఆనందమయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని లోపూడి గ్రామ శివారు బాసవరప్పాడు, లోపూడి కాలనీలో శనివారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన గ్రామంలోని ప్రసిద్ధ గోపయ్య స్వామి సమేత లక్ష్మీతిరుపతమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో కలిసి గడప గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి అందిన పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వివరించారు. తమ ప్రభుత్వంలో వరుస సంక్షేమ పథకాలతో లక్షలాది మంది పేదలకు నేరుగా ప్రయోజనం కలిగించి, వారి జీవితాలను ఆనందమయం చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని పథకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు మరింత మేలు చేయనున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పథకాలను అందరూ గుర్తించి, 2024లో జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ పేరం కృష్ణ, ఉప సర్పంచ్ మువ్వా బాబూరావు, రమణక్కపేట సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ, తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, పి.ఆర్. ఏఈ తిరుమలశెట్టి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

సాహితీ కళారంగాల వేదిక విజయవాడ



మాట్లాడుతున్న శంకరరావు, వేదికపై ఆచార్య ఎస్వీ సత్యనారాయణ తదితరులు

విజయవాడకల్చరల్: సాహితీ కళా రంగాల వేదిక విజయవాడ అని హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. గాంధీనగర్‌లో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన హనుమంతరాయ గ్రంథాలయ కళావేదిక ప్రారంభోత్సవానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ హనుమంతరాయ గ్రంథాలయాన్ని ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. రూ.30 లక్షలతో ఆడిటోరియాన్ని ఆధునీకరించామని, కళాకారులకు కళాసంస్థలకు అందుబాటులోకి తీసువచ్చామని, గ్రంథాలయానికి, కళావేదికకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. కళావేదికను ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ప్రారంభించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. విలువతో కూడిన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయ ఆధునిక భవనాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావి శారద ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పరిశోధకులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, వంశీరామరాజు, డాక్టర్ కె.ధర్మారావు, నల్లూరి వెంకటేశ్వర్లు, రంగస్థల నటుడు సంజీవి పాల్గొన్నారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

కొనసాగుతున్న రంగమ్మ పేరంటాల తిరునాళ్లు

ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మ పేరంటాలు మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పరిసర గ్రామాలతో పాటు ఉభయ కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు రావడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. తమ వాహనాలు, ప్రభ బండ్లు, పశువులను గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పాడిపంటలతో అందరు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటున్నారు. అర్ధరాత్రి సమయంలో అమ్మవారి ఊయల సేవ కార్యక్రమం జక్కా వారసుల పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. ఆ సమయంలో భక్తులందరూ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారిని ఊయల ఊపే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అమ్మవారిని దర్శించుకున్నారు. భీమవరపు యతేంద్ర రామకృష్ణ ఏర్పాటు చేసిన భారీ ప్రభ భక్తులను విశేషంగా ఆకర్షించింది. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

తెలుగువారి ఆత్మ.. హరికథ

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కోట సచ్చిదానంద శాస్త్రిని సత్కరిస్తున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: తెలుగువారి ఆత్మ.. హరికథ అని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. డాక్టర్ దమ్మాలపాటి రామారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్న హరికథా కళాకారుడు కోట సచ్చిదానంద శాస్త్రికి విజయవాడ సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో శనివారం రాత్రి సత్కార కార్యక్రమం నిర్వహించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ కవులు కళాకారులను గుర్తించి ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు. హరికథకు ప్రాధాన్యమివ్వాలన్నారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలన్నారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ హరికథా పితామహుడిగా ఆదిభట్ల నారాయణదాసును భావిస్తారని ఇటీవల కాలంలో హరికథకు పునరుజ్జీవం తీసుకువచ్చిన కథకులు కోట సచ్చిదానంద శాస్త్రి అని తెలిపారు. సంగీత సాహిత్యాల మేలి కలయిక కోట వారి హరికథా గానమని చెప్పారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ కోటవారి హరికథను అనేక సార్లు వినే అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దమ్మాలపాటి రామారావు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు దమ్మాలపాటి చంద్రశేఖర్, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ వీఎన్‌డీఎస్ మూర్తి పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

గన్నవరంరూరల్: కొత్తగా అర్హత ఉన్న రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజశ్వి సూచించారు. ఆమె శనివారం మాట్లాడుతూ 2023వ సంవత్సరానికి కొత్తగా అర్హత పొందిన వారు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. గత సంవత్సరం లబ్ధి పొందిన రైతులు కొత్తగా రిజిస్ట్రేషన్ అవసరం లేదని, కొత్తగా అర్హత ఉన్నవారు మాత్రమే నమోదు చేసుకోవాలని, వారికి రైతు భరోసా వస్తుందని వివరించారు.

రక్త హీనతను నివారించండి

పెనమలూరు:రక్తహీనతను నివారించాలని, వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అమలు చేయాలని ఆరోగ్య విద్య విస్తరణ అధికారి బోళ్ల శివసాంబిరెడ్డి అన్నారు. ఎనీమియా ముక్తి భారత్, జాతీయ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న తీరు పై ఆయన శనివారం పెనమలూరు, కానూరు సచివాలయాల పరిధిలో పరిశీలించి వివరాలు సేకరించారు. రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఐరన్ బిల్లలు, సిరప్ సక్రమంగా పంపిణీ చేసి గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో సక్రమంగా వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు పురుషోత్తమరాజు, జి.రామ్‌కుమార్, కెవి.రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమేయం.. గోమయం..



గో ఆధారిత ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- గో ఆధారిత ఉత్పత్తులతో ఆరోగ్యం
- పంచగవ్యాల వినియోగంతో 90 రకాల ఉత్పత్తులు
- లక్షల్లో పెట్టుబడి.. కోట్లలో టర్నోవర్..
- విదేశాల్లో విశేష ఆదరణ
- గో సేవలో అమోఘమైన కృషి చేస్తున్న మచిలీపట్నం వాసి

గోఆధారిత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. రసాయనాలు, సైడ్ ఎఫెక్టులు లేకపోవడంతో వీటిని ఉపయోగించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికి తోడు పురాణాల్లో గోవుకు విశేషమైన స్థానం ఉండటం, మన సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించి గోమాతను పూజించడంతో, వాటి నుంచి వచ్చే ఉత్పత్తులకూ డిమాండ్ పెరిగింది. దీన్ని గమనించిన ఓ యువకుడు తాను చేస్తున్న ఐటీ ఉద్యోగాన్ని సైతం పక్కన పెట్టారు. ఈ ఉత్పత్తులకు విశేష ఆదరణ కల్పించడానికి నడుం బిగించారు. మొదట్లో లక్షలతో ప్రారంభమైన వ్యాపారం, దినదినాభివృద్ధి చెందుతూ కోట్లలోకి టర్నోవర్ చేరుకుంది. విదేశాల్లో విస్తృత ప్రచారం చేస్తూ, ఈ ఉత్పత్తులను వారికి సైతం అందజేస్తున్నారు. ఆయనతోపాటు మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్న 'కృషి'ని మనమంతా ప్రోత్సహించాలి.

కృష్ణాడెస్క్: గోవు ఆర్థిక వ్యవస్థకు మూలం అనే వారు మన పూర్వీకులు. ఆవులను ఆధ్యాత్మిక కేంద్ర బిందువుగా చూడటమే కాకుండా.. అణువణువునా ఔషధ విలువలున్నాయని ప్రామాణికంగా ఆనాడే గుర్తించారు. దేశవాళీ ఆవులతో ఆర్థిక వనరులు ఉన్నాయని తెలుసుకున్నారు. పూర్వీకుల మాదిరే గోమయం, గో పంచకం, పంచగవ్యం, పాలు, నెయ్యి ఇవన్నీ అత్యున్నత విలువలు గలవని గ్రహించారు కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన వడ్డి కృషి. పర్యావరణ, రసాయన రహితమైన పంచగవ్యాలను ఉపయోగించి ప్రజారోగ్యాన్ని కాపాడే ఉత్పత్తులు తయారు చేయాలని సంకల్పించారు. స్వయంగా గో ఆధారిత ఉత్పత్తుల కేంద్రాన్ని స్థాపించారు. మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారు. కోట్లాది రూపాయల టర్నోవర్ పొందడంతో పాటు దేశ విదేశాల్లో కూడా ఉత్పత్తులకు ఆదరణ వచ్చేలా తయారు చేయడం విశేషం.

90 రకాల ఉత్పత్తులు

వినియోగదారులు వాడే రోజువారీ వస్తువులతో పాటు సౌందర్య సాధనాలు, ఔషధాలు, 90 రకాల ఉత్పత్తులను ఈ కేంద్రం ద్వారా తయారు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆవుపేడతో ప్రమిదలు, పిడకలు, సబ్బులు, ధూప్‌స్టిక్స్, సేంద్రియ ఎరువుల తయారీ, విగ్రహాలు, అలంకరణ సామగ్రి, అగరు బత్తులు వంటివి ఎన్నో తయారవుతున్నాయి. ఒట్టిపోయిన ఆవుల ద్వారా కూడా గోమూత్రం, గోమయంతో 30 రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తుల్లో పంచగవ్య నాజల్ డ్రాప్. దీని ద్వారా తలనొప్పి, మైగ్రేన్, మెదడులో ఉన్న రక్తం గడ్డలను ఛిద్రం చేసే ఔషధానికి, ప్రాచీన పద్ధతుల్లో నెయ్యితో తయారు చేసిన కాటుకకు మంచి ఆదరణ లభిస్తోంది. రసాయనం లేకుండా డిష్ వాష్ పౌడర్‌ను ఈ ఉత్పత్తుల్లో తయారు చేయడం విశేషం.





మచిలీపట్నంలోని గో సేవ షాపు



సబ్బులు ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

కరోనా సమయంలోనూ మంచి ఆదరణ



గో ఆధారిత వస్తువులకు కరోనా సమయంలో కూడా మంచి ఆదరణ లభించింది. కరోనా విపత్కర పరిస్థితుల్లో మంచి ఆరోగ్యం పొందేందుకు ప్రజలు గో ఆధారిత ఉత్పత్తులను వినియోగించారు. మామూలుగా కంటే 20 శాతం అధికంగా అమ్మకాలు జరిగాయి.

– వడ్డి కృషి, గో ఆధారిత ఉత్పత్తుల కేంద్రం యజమాని

త్వరలో భోజనశాల

ఈ గోశాల ద్వారా మచిలీపట్నంలో ఉత్పత్తులతో షాపును ఏర్పాటు చేయటంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి త్వరలో భోజనశాల ఏర్పాటు చేయబోతున్నారు. దేశీయ బియ్యంతో అన్నం, కూరలతో పాటు రాగిసంగటి, చద్దెన్నం, దిబ్బరొట్టె జొన్న రొట్టె వంటి రకాలను ప్రజలకు పరిచయం చేయబోతున్నట్టు కృషి తెలిపారు.

ఆదాయపరంగానూ..

తొమ్మిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ గోశాలలో గో ఆధారిత ఉత్పత్తుల వ్యాపారం ప్రారంభ సంవత్సరంలో రూ. 20 లక్షలు టర్నోవర్ ఉండేది. అంచెలంచెలుగా ఉత్పత్తుల ఆదరణ లభించటంతో ప్రస్తుతం రూ.1.5కోట్ల టర్నోవర్ జరుగుతోంది. ఇది కాక సింగపూర్, అమెరికాల్లో ఉత్పత్తులకు ఆదరణ పెరగడంతో ఆ ప్రాంతాలకు విశాఖపట్నం షిప్‌యార్డు కేంద్రంగా కంటైనర్ల ద్వారా ఉత్పత్తులు పంపి అక్కడి ప్రజలకు అందజేస్తున్నారు.

గోసారంతో నివారించదగిన వ్యాధులు

గాయాలు, క్యాన్సర్, మధుమేహం, రోగ నిరోధక శక్తి, మూల వ్యాధులు, చర్మ సంరక్షణ, నులి పురుగుల నివారణ జరుగుతుంది.

ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



దుర్గగుడి ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వరుస సెలవులు రావడంతో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండో శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ ఉండటంతో ఘాట్ రోడ్డు పైకి కార్లు, ఇతర వాహనాలను అనుమతించలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ వాహనాలను హెడ్‌వాటర్ వర్క్స్, వీఎంసీ కార్యాలయం, కెనాల్ రోడ్డు, సీతమ్మ వారి పాదాలు, ఇరిగేషన్ స్థలంలో నిలుపుకుని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొండపై ఎక్కువ రద్దీ కనిపించింది. భక్తులు ఇబ్బంది పడకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయగా, భక్తుల దాహార్తిని తీర్చడానికి మినరల్ వాటర్‌తో పాటు మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయ ఈవో భ్రమరాంబ క్యూలైన్లను పర్యవేక్షించగా, అన్ని శాఖల ముఖ్య అధికారులకు ఆలయ ప్రాంగణంలో విధులను కేటాయించారు. ఆర్జిత సేవల్లోనూ పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు సాయంత్రం పంచహారతుల సేవలోనూ పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

ధార్మిక చింతన పెరగాలి



అనుగ్రహభాషణం చేస్తున్న శంకరవిజయేంద్రసరస్వతి

విజయవాడ కల్చరల్: సమాజంలో ధార్మిక చింతన పెరగాలని, యువత నియమబద్ధ జీవితం గడపాలని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. పీబీ సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యాన శనివారం మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో స్వామి అనుగ్రహ భాషణం చేశారు. భారతీయ ఏకాత్మకత ధర్మవిచక్షణతోనే ఇది సాధ్యమన్నారు. విద్యతోపాటు, వినయం, చిత్త శుద్ధి, ఏకాగ్రతతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని చెప్పారు.అందరికీ విద్య అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. మోక్షమార్గంపై అవగాహన పెంచుకోవాలని భక్తి మార్గాన్ని ఎన్నుకొని జీవిత మార్గాన్ని మార్చుకోవాలని పేర్కొన్నారు. పురాణాలు, ఇతిహాసాలు సనాతన సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. సిద్ధార్థ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు నాగభూషణరావు, కళాపీఠం కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు. వేదపండితులు శంకర విజయేంద్ర స్వామికి స్వాగతం పలికారు. భక్తుల సందేహాలకు స్వామి సమాధాన మిచ్చారు. సిద్ధార్థ విద్యాసంస్థల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూరుశాతం వ్యాక్సినేషన్ చేయించాలి



వ్యాక్సినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి రత్నగిరి



పెద అవుటపల్లి పీహెచ్‌సీ వద్ద హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి

హనుమాన్‌జంక్షన్ రూరల్: శిశు మరణాలను తగ్గించేందుకు పుట్టిన ప్రతి శిశువుకు తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కె.రత్నగిరి చెప్పారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. మాతృ, శిశు మరణాలను తగ్గించే విధంగా వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఆశ వర్కర్లు తమ పరిధిలో ఇంటింటికీ తిరిగి రక్తహీనత కలిగిన గర్భిణులు, బాలింతలను గుర్తించాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా, సీహెచ్‌వో ఎస్.ఫణి కుమార్, ఎంపీహెచ్ఎస్ ఎం.అప్పారావు, హెచ్‌వీ అలిమాబి, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు

ఉంగుటూరు: అర్హులైన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఇవ్వాలని హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి అన్నారు. పెద అవుటపల్లి పీహెచ్‌సీని హెల్త్ డైరెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హత ఉన్న ఒక బిడ్డ కూడా మిస్ అవకుండా అందరికీ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌బాబు, పీహెచ్‌సీ డాక్టర్లు హిమబిందు, కరిముల్లా పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్ష విధులకు హాజరు కాకుండా, అధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని ఎంఏఎంసీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా ఎస్‌కే రియాజుద్దీన్ పనిచేస్తున్నాడు. ఆయనను పదో తరగతి పరీక్షలకు సత్యనారాయణపురంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం డిపార్ట్‌మెంటల్ అధికారిగా నియమించారు. షెడ్యూల్ ప్రకారం శనివారం పదో తరగతి ఇంగ్లిషు సబ్జెక్ట్ పరీక్ష నిర్వహించారు. రియాజుద్దీన్ శనివారం సెలవుగా భావించి విధులకు హాజరు కాలేదు. ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. పైగా అధికారులకు పదో తరగతి పరీక్ష లేదని సమాధానం ఇచ్చాడు. పరీక్షకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు రియాజుద్దీన్‌ను సస్పెండ్ చేశారు.

ఐఎఫ్‌టీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆలిండియా 7వ మహాసభలను ఈ నెల 16,17,18 తేదీల్లో తిరుపతిలో నిర్వహిస్తున్నామని సమాఖ్య ఏపీ ప్రధాన కార్యదర్శి కె.పోలారి చెప్పారు. సున్నంబట్టీల సెంటర్‌లోని రామనర్సయ్య భవన్‌లో శనివారం మహాసభల పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. పోలారి మాట్లాడుతూ ఈ నెల 16న తిరుపతి తిరుచానూరు రోడ్డులోని లక్ష్మీపురం సర్కిల్ నుంచి పద్మావతి పార్కు వరకు కార్మికుల ప్రదర్శన, 17, 18 తేదీల్లో తిరుపతిలోని ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో సమాఖ్య ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. సమాఖ్య నాయకులు ముని శంకర్, డి.శ్రీనివాసరావు, పెద్దిరాజు, శ్రీధర్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీపీ హోం పరిశీలన



మచిలీపట్నంటౌన్: పట్టణంలో సుకర్లాబాద్‌లోని ది ఇండియన్ క్రిస్టియన్ అసెంబ్లీస్ (ఐసీఏ) హోంను ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ శనివారం సందర్శించారు. హోంలో చిన్నారులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. హోంను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు అలవర్చుకుంటే పెద్దయ్యాక సమాజంలో పేరు ప్రఖ్యాతలు వస్తాయని వివరించారు. బాగా చదివి వృద్ధిలోకి వచ్చి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. చిన్నారులకు అవసరమైన వసతులు అమర్చాలని నిర్వాహకులకు సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రవిభార్గవ్, రాజ్‌కుమార్, జాన్సన్, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జాన్సన్, హోం నిర్వాహకులు వంశీకృష్ణ, గ్లాడీబాబు, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఉన్న వ్యక్తికి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో బసవేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నూజివీడు: మండలంలోని అన్నవరానికి చెందిన వలంటీర్ మట్టా రాణి గన్నవరం సమీపం లోని చిన్న అవుటపల్లిలోని పిన్న మనేని సిద్ధార్థ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్దకు శనివారం వెళ్లి పింఛన్ అందజేశారు. అన్నవరానికి చెందిన ఆలూరు బసవేశ్వరరావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అక్కడకు వెళ్లి అతనికి పింఛన్ అందజేయడంతో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పదో తరగతి పరీక్షలకు 45మంది గైర్హాజరు



నూజివీడులోని సెయింట్ మేరీస్ స్కూల్లో పదో తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు

నూజివీడు: డివిజన్ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం ఇంగ్లిష్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు డివిజన్ పరిధిలో 45 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 3,253 మంది విద్యార్థుల్లో 3,208 మంది హాజరవ్వగా 45మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైనప్పటికీ 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. నూజివీడుతో పాటు మండలంలో మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో 1,713 మందిలో 20మంది గైర్హాజరవ్వడంతో 1,693 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆగిరిపల్లి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 546 మందికి ఎనిమిది మంది గైర్హాజరవ్వడంతో 538 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 407 మందికి నలుగురు గైర్హాజరవ్వగా 403 మంది, ముసునూరు మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 587 మందికి 13మంది గైర్హాజరవ్వగా 574 మంది హాజరయ్యారు. వేసవి దృష్ట్యా పరీక్షలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా బెంచీలు, తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మారెమ్మ అమ్మవారి గ్రామోత్సవం

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభిచారు. ఆలయ అర్చకులు, ఈఓ వై.సీతారామయ్య, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్ కుమార్ ఎమ్మెల్యేని సత్కరించి జ్ఞాపికను అందజేసారు. శనివారం మధ్యాహ్నం వరకు గ్రామోత్సవం కొనసాగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్య నారాయణరెడ్డి, గ్రామ ప్రముఖుడు బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ కారుమంచి స్వాతి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, విస్సన్నపేట సర్పంచ్ నాగమల్లేశ్వరి, గృహసారథుల మండల కన్వీనర్‌శివబాజీ పాల్గొన్నారు.

మత్స్యకారులకు భరోసా

ఎమ్మెల్యే రక్షణనిధి



రోలుపడి చెరువులో చేపపిల్లల సాగు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరువూరు: మత్స్యకారులకు జీవనోపాధి కల్పనలో భాగంగా అన్ని చెరువుల్లో చేపపిల్లలను వదిలే కార్యక్రమం చేపట్టినట్లు తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. మండలంలోని రోలుపడి ఊర చెరువులో మైనర్ ఇరిగేషన్ శాఖ, మత్స్యశాఖ సంయుక్తంగా చేపట్టిన చేపపిల్లల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపపిల్లలను చెరువులో వదిలిన ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.2 లక్షల విలువైన చేపపిల్లలను ప్రభుత్వం ఉచితంగా అందజేసినందున వాటి ద్వారా మత్స్యకారులు లబ్ధిపొందాలని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ బండి సుజాత, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ముష్టికుంట్ల, లక్ష్మీపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్లు బండి రవికుమార్, తాళ్లూరి నవీన్‌కుమార్, రోలుపడి సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ, వెంకటరత్నం పాల్గొన్నారు.

11న వాలీబాల్ పోటీలు

జి.కొండూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి రెండు రోజులపాటు జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో భాగంగా తయారు చేసిన ప్రచార వాల్‌పోస్టర్లను ఎస్సై ధర్మరాజు చేతులమీదుగా శనివారం విడుదల చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలతో పాటు అంబేడ్కర్ జీవితచరిత్రపై పాఠశాల స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



బాలికల గురుకులం ప్రిన్సిపాల్ శ్రీదేవి

ముసునూరు: 2023–24 విద్యా సంవత్సరం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ముసునూరు బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె వివరాలను వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ శనివారం ప్రారంభమైందని, ఈ నెల 24వ తేదీ వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ముసునూరు, నిమ్మకూరు, పులిగడ్డ గురుకుల పాఠశాలల్లో, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నాగిరెడ్డిగూడెం, అప్పలరాజుగూడెం గురుకులాల్లో ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 98665 59629లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తరాలు మారినా వన్నె తరగని వందేమాతరం

ముసునూరు: తరాలు మారినా వన్నె తరగని చైతన్య గీతాన్ని మనకు అందించిన బంకింగ్ చంద్ర చటర్జీ పూజ్యనీయుడని లోపూడి ఆశ్చర్య పాఠశాల ఉపాధ్యాయురాలు ఎల్.సుజాత పేర్కొన్నారు. జాతీయ గేయం వందేమాతరం రచయిత బంకింగ్ చంద్ర చటర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రంలో పాము కలకలం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం డీఈఓ తాహెరా సుల్తానా సందర్శించారు. పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఇంగ్లిష్ పరీక్ష జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. హెచ్ఎం ఎన్.రవీంద్రభవాని, పలువురు అధికారులు పాల్గొన్నారు. అయితే డీఈఓ వెళ్లిన కొద్దిసేపటి తర్వాత పాఠశాలలోకి పాము ప్రవేశించడం కలకలం రేపింది. తొలుత హెచ్ఎం రూమ్‌లోకి పాము రావడం గమనించిన సిబ్బంది హడావుడి చేయడంతో అది అక్కడ నుంచి పదో తరగతి పరీక్ష జరుగుతున్న 7వ నంబర్ రూమ్‌లోకి వెళ్లింది. పామును గమనించిన పరీక్ష రాస్తున్న విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఓ ఉపాధ్యాయుడు ధైర్యం చేసి పామును కర్రతో కొట్టి చంపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ పాము విషపూరితం కాని జర్రిగొడ్డు జాతికి చెందినదిగా సిబ్బంది గుర్తించారు.

పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన డీఈఓ

గన్నవరంరూరల్: మండలంలోని 10వ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం డీఈఓ తాహెరా సుల్తానా శనివారం తనిఖీ చేశారు. గొల్లనపల్లి, ముస్తాబాద హైస్కూళ్లను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలించారు. ఎంఈఓ బి.శ్రీనివాస్ ఆమె వెంట ఉన్నారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర



పూజలు అందుకున్న అంకమ్మ దేవత

కనుమూరు(గంపలగూడెం): కనుమూరులో గ్రామ దేవతలు అంకమ్మ మహాలక్ష్మమ్మల జా తరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను తయారు చేసి పసుపు, కుంకాలు, నూత న వస్త్రాలతో భక్తులు అమ్మవార్లకు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.